క్లుప్తంగా

వైఎస్సార్ బీమా అందజేత

పెనమలూరు: గంగూరు గ్రామంలో బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా సాయం మంగళవారం అందజేశారు. గ్రామానికి చెందిన అక్కిపల్లి వెంకటనరసింహారావు ఇటీవల మరణించారు. మృతుడి భార్య పాపాయమ్మకు వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయం రూ. 10వేలు గ్రామ మాజీ సర్పంచి అక్బర్‌బాషా అందజేశారు. పంచాయతీ కార్యదర్శి ఏ.సుబ్బారావు, గ్రామ వేల్ఫర్ అసిస్టెంట్ సుధాకర్ పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు గణ్జెం సంజీవరావు, మంగామణి దంపతుల సహకారంతో అన్నదానం నిర్వహించారు. ఆలయ పాలక మండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈవో కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

కంకిపాడు: మండలంలోని చలివేంద్రపాలెం ప్రధాన సెంటర్‌లో అయ్యప్ప మాలధారి జంపాన నాగమురళీకృష్ణస్వామి అయ్యప్ప పడిపూజ వైభవంగా చేశారు. మహాశివుడు, అయ్యప్ప, వివిధ దేవతామూర్తులను కొలువుదీర్చి పడిమండపాన్ని సిద్ధం చేసి అయ్యప్పను పూజించారు. గురుస్వామి కోనూరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పడిపూజలో మధు సంబూద్రి మహాపడి పూజ చేయించారు.

కంకిపాడు: అయ్యప్ప మాలధారుల ఊరేగింపు మహోత్సవం కంకిపాడు పట్టణంలో మంగళవారం కోలాహలంగా సాగింది. అయ్యప్పను స్మరిస్తూ పట్టణ వీధుల్లో పైటతుళ్లి ఆడారు. రంగులు పులుముకుని, వివిధ వేషధారణలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమాన్ని అయ్యప్ప భక్త బృందం పర్యవేక్షించింది.

శైవ క్షేత్రాల దర్శనానికి ప్రత్యేక బస్సులు

గన్నవరం: కార్తిక మాసం సందర్భంగా గన్నవరం ఆర్టీసీ డిపో నుంచి శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీస్‌లను నడుపుతున్నట్లు డీఎం పి.శివాజీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పంచారామ క్షేత్రాల దర్శనం నిమిత్తం డిసెంబర్ 3, 4 తేదీల్లో ఉదయం 3 గంటలకు గన్నవరం నుంచి బస్సులు బయలుదేరతాయని పేర్కొన్నారు. అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట ఆలయాల దర్శనం అనంతరం అదే రోజు రాత్రికి గన్నవరం చేరుకుంటాయన్నారు. పంచారామలకు వెళ్లేందుకు సూపర్ లగ్జరీ బస్సుకు రూ. 1,150, అల్ట్రా డీలక్స్‌కు రూ. 1,100 టిక్కెట్ ధర ఉంటుందని చెప్పారు. డిసెంబర్ 2న త్రిలింగ దర్శనం నిమిత్తం సాయంత్రం 7 గంటలకు బస్సు బయలుదేరి యాగంటి, మహానంది, శ్రీశైలం ఆలయాలు దర్శనం తర్వాత 4వ తేది ఉదయం గన్నవరం చేరుకుంటుందని వెల్లడించారు. త్రిలింగ దర్శనానికి సూపర్ లగ్జరీ బస్సు టిక్కెట్ ధర రూ. 1,900 ఉంటుందని వెల్లడించారు.

శబరిమలై యాత్రకు బస్సులు

శబరిమలై యాత్రకు వెళ్లే అయ్యప్ప స్వాముల కోసం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీఎం తెలిపారు. ఆరు, ఎనిమిది, 10 రోజుల యాత్ర కోసం సూపర్ లగ్జరీ బస్సులను తక్కువ చార్జీతో ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఇతర వివరాలు కోసం 7382905633, 8790996090 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

కొనుగోళ్లకు ప్రాధాన్యం

- కృష్ణా జిల్లాలో 3.92 లక్షల ఎకరాల్లో ఈ–క్రాప్ నమోదు
- 317 రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ
- 18 వేల క్వింటాళ్లకు పైగా ధాన్యం కొనుగోలు
- ఇప్పటికే రైతులకు రూ.8.23 కోట్ల చెల్లింపు
- రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో హర్షం వ్యక్తంచేస్తున్న రైతులు



గోసాల దొంక రోడ్డులో ధాన్యం కాటా వేస్తున్న కూలీలు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: కృష్ణా జిల్లాలో ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు, తోట్లవల్లూరు, పమిడిముక్కల, గన్నవరం, పెడన ప్రాంతాల్లో ఇప్పటికే వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 14వ తేదీ నుంచి పౌరసరఫరాల సంస్థ అధికారులు ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించారు. 317 రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేయగా, ప్రస్తుతం 87 ఆర్బీకేల్లో కొనుగోళ్లు జరుగుతున్నాయి. 1,685 మంది రైతుల నుంచి రూ.40.93 కోట్ల విలువైన 18,692.440 టన్నుల ధాన్యం సేకరించారు. ఇప్పటికే రైతుల బ్యాంక్ ఖాతాల్లో రూ.8.23 కోట్ల నగదు జమ చేశారు. మరో రూ.18 కోట్ల బిల్లులను జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజరు ఆమోదించారు. మద్దతు ధర పొందేందుకు పాటించాల్సిన నాణ్యతా ప్రమాణాలపై రైతులకు అవగాహన కల్పించారు. ధాన్యం సేకరణకు సంబంధించి గ్రామాల్లో పోస్టర్లు, కరపత్రాల ద్వారా రైతులకు విస్తృత ప్రచారం చేస్తున్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

- జిల్లాలో మొత్తం 3,92,565 ఎకరాల వరి పంటను ఈ–క్రాప్‌లో నమోదు చేశారు. ఈ సమాచారం ఇప్పటికే వ్యవసాయ శాఖ నుంచి పౌరసరఫరాల సంస్థ అధికారులకు చేరింది.
- ఈ ఏడాది ఏ–గ్రేడ్ ధాన్యం క్వింటా మద్దతు ధర రూ.2,203, కామన్ రకం రూ.2,183గా ప్రభుత్వం నిర్ణయించింది.
- ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 10,52,907 టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారుల అంచనా.
- ధాన్యం సేకరణ కోసం జిల్లా వ్యాప్తంగా 150 రైస్ మిల్లులను గుర్తించారు.
- ధాన్యం సేకరణకు 1.60 కోట్ల గోనే సంచులు అవసరవుతాయని గుర్తించి, 10 కేంద్రాల్లో వీటిని నిల్వ చేశారు.
- ధాన్యం తూకం వేసేందుకు 44 వేబ్రిడ్జిలను గుర్తించారు.
- ధాన్యం రవాణా చేసే వాహనాలకు జీపీఎస్ అమర్చారు.
- రైతులే రవాణా వాహనాలను సమకూర్చుకోవచ్చు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏజెన్సీ, ఇతర వాహనాల ద్వారానూ ధాన్యం రవాణా చేసుకోవచ్చు.
- రవాణా చార్జీలను ప్రభుత్వమే చెల్లిస్తుంది. ధాన్యం విక్రయించిన తరువాత 21 రోజుల్లోఎ రైతుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ చేస్తారు.
- రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పారదర్శకంగా కొనుగోళ్లు



జిల్లాలో పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు జరిగేలా ఏర్పాట్లు చేశాం. ప్రస్తుతం పెనమలూరు, పామర్రు, పెడన నియోజకవర్గాల్లో ధాన్యం సేకరణ వేగంగా సాగుతోంది. ఆర్‌బీకే, మిల్లుల వద్ద తేమ శాతంలో తేడాలు రాకుండా జాగ్రత్తలు తీసుకొంటున్నాం. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటాం, రైతుల సమస్యల పరిష్కారం కోసం కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నాం. డయల్ యువర్ జేసీకి కాల్ చేసి ఫిర్యాదు చేయొచ్చు. దళారులు, మధ్య వర్తుల మాటలు నమ్మి రైతులు మోసపోవద్దు.

– అపరాజిత సింగ్,
జాయింట్ కలెక్టర్, కృష్ణా జిల్లా

సంక్షేమ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలి

గన్నవరం రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని సంక్షేమ ప్రభుత్వాన్ని ప్రజలందరూ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అన్నారు. మండలంలోని కొత్తగూడెం గ్రామంలో రూ.38లక్షలతో నిర్మించే రోడ్లు, డ్రెయిన్ల పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. రూ.15లక్షలతో నిర్మించిన రోడ్లు, ఎమ్మెల్యే ఆర్థిక సాయంతో నిర్మించిన తాగునీటి ప్లాంటును ఈ సందర్భంగా ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సచివాలయం, వలంటీర్ వ్యవస్థల నిర్మాణంతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతూ, అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని చెప్పారు. చేయూత, ఆసరా, చేదోడు, అమ్మఒడి తదితర పథకాలన్నింటినీ, ఎంతో చిత్తశుద్ధితో ప్రజలకు అందించారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం విద్యను ప్రవేశపెట్టి పేదలను విద్యావంతులుగా చూడాలన్న ఆశయంతో సీఎం జగన్ పని చేస్తున్నారని వివరించారు. ప్రజలకు మరింత మేలు చేసే శక్తి జగనన్నకు రావాలని, ఆయన ద్వారా మన గ్రామాలన్నీ మరింతగా వృద్ధి చెందాలని పేర్కొన్నారు. పేదలకి పెన్షన్ ఇవ్వడం తప్పు అని, కూలి పని చేసుకునే వారి పిల్లలు కూలీలుగా మారాలని, వారు అభివృద్ధి చెందడం ఏమాత్రం ఇష్టం లేని పార్టీల విమర్శలు తిప్పికొట్టే విధంగా ప్రతి ఒక్కరు వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని, సీఎం జగన్‌ని ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ అనగాని రవి, జడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, జడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, మండల పార్టీ అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్, మండల జేసీఎస్ కన్వీనర్ కైలే శివకుమార్, మండల కో–ఆప్షన్ మెంబర్ కరిముల్లా, సర్పంచి తూంపాటి రాంబాబు, ఉపసర్పంచి దేవరపల్లి రాంబాబు, పంచాయితీ కార్యదర్శి బాపూజీ, స్థానిక నాయకులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు

కంకిపాడు: గడప గడపకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు–2 సచివాలయం పరిధిలోని కాలువ కట్ట, పుట్టకట్ట, ఈడుపుగల్లు ప్రధాన గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించి, సంక్షేమ బ్రోచర్లు అందించారు. ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని వాటిపై అక్కడికక్కడే అధికారులతో సమీక్షించారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు. ఇళ్లస్థలాలు, జగనన్న తోడు అమలు చేయాలని వచ్చిన వినతులపై అధికారులకు సూచనలు ఇచ్చారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ సంక్షేమం ప్రతి ఇంటికీ చేరాలన్నదే జగనన్న ఆకాంక్ష అన్నారు. టీడీపీ, ఇతర పక్షాలు చేస్తున్న అనవసర రాద్ధాంతాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, పార్టీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు, నగర కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా శ్రీనివాసరావు, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, డైరెక్టర్ నకరికంటి శేఖర్, మాజీ ఎంపీపీ మాదు శ్రీహరిరాణి తదితరులు పాల్గొన్నారు.



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పార్థసారథి

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: 18 ఏళ్ల వయస్సు నిండిన ప్రతీ పౌరుడు విధిగా ఓటు హక్కు నమోదు చేసుకుని, ఎన్నికల్లో తనవంతు బాధ్యతను నేరవేర్చాలని బాపులపాడు ఎంపీపీ యర్రగొర్ల నగేష్ అన్నారు. ఓటర్లను చైతన్య పరచడం, నైతిక విలువలతో కూడిన ఓటింగ్ ప్రక్రియలో యువతను భాగస్వామ్యం చేయడంపై అవగాహన కల్పిస్తూ అధికారులు, డ్వాక్రా మహిళలు హనుమాన్‌జంక్షన్‌లో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. డెప్యూటీ తహసీల్దార్ కె.వెంకటరమణ మాట్లాడుతూ కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకోవడం, ఓటర్ల జాబితాలో మార్పులు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఏడాదికి నాలుగు సార్లు దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని వివరించారు. అనంతరం ప్రధాన కూడలిలో మానవహారం నిర్వహించారు. ఎంపీడీఓ కె.జోగేశ్వరరావు, మండల సర్వేయర్ ఫణికుమార్, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఏలు, బీఎల్‌వోలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

రూరల్ మండలానికి చేరుకున్న ఎమ్మెల్సీ పాదయాత్ర

రామవరప్పాడు: రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తూ 'జగనే రావాలి–జగనే కావాలి' నినాదంతో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చేపట్టిన తిరుమల పాదయాత్ర మంగళవారం విజయవాడ రూరల్ మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా రఘురాజుకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస్‌కుమార్ స్వాగతం పలికారు. శ్రీనివాస్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ రఘురాజు తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. ఇప్పటి వరకూ సుమారు 700 కిలోమీటర్లు పాదయాత్ర చేసి సీఎం జగన్ ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లారని తెలిపారు. యాత్రలో వైఎస్సార్ సీపీ నాయకులు ముక్కు వెంటేశ్వరరెడ్డి, పాదిలి చంటిబాబు, మేశం చిన్నా తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'ను విజయవంతం చేయాలి

విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఆడుదాం ఆంధ్ర క్రీడలను విజయవంతం చేయాలని ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి అన్నారు. విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర నిర్వహణపై జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు క్రీడలను నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహించాలని ప్రభుత్వం మంచి కార్యక్రమం నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ఎంపీడీఓ బి.భార్గవి మాట్లాడుతూ మండలంలో గన్నవరం, మైలవరం నియోజకవర్గాలకు చెందిన గ్రామాల నుంచి క్రీడల్లో పాల్గొనే విధంగా చూడాలన్నారు. గ్రామస్థాయిలో వచ్చే నెల 15 నుంచి జనవరి 24వరకు పోటీలు జరుగుతాయని చెప్పారు. ఉప ఎంపీపీ వేమూరి సురేష్, ఎంఈఓ 2 సూరిబాబు, హైస్కూల్స్ పిఈటీలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి

హనుమాన్‌జంక్షన్ రూరల్: సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించడం ద్వారా మామిడి రైతులు అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా ఉద్యాన అధికారి జె.జ్యోతి తెలిపారు. బాపులపాడు మండలం మల్లవల్లిలోని పీఏసీఎస్ ప్రాంగణంలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మామిడి రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుత సీజన్‌లో మామిడి రైతులు పాటించాల్సిన సస్యరక్షణ చర్యలను జిల్లా ఉద్యానాధికారి వివరించారు. పూతదశలో ఉన్న మామిడి తోటల్లో లీటరు నీటికి మల్టీకే 10 గ్రాములు, బోరాన్ 2 గ్రాములు కలిసి స్ప్రే చేయాలని సూచించారు. తద్వారా పూత రాలిపోకుండా ఉంటుందని, అధికంగా మామిడి కాయలు కాసేందుకు అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సూక్ష్మ, బిందు సేద్యం అధికారి విజయలక్ష్మి, మండల ఉద్యాన అధికారి ఇ.హరిచంద్, అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ మేనేజర్ నితీష్ పాల్గొన్నారు.

నేడు ఆలయ ధ్వజ స్తంభం ప్రతిష్ఠ

గన్నవరం: మండలంలోని బుద్దవరం శివారు రాజీవ్‌నగర్ కాలనీలో వేంచేసియున్న శ్రీవిజయదుర్గాదేవి(సంతానలక్ష్మి) ఆలయ శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఆగమ పండితుల పర్యవేక్షణలో ఉదయం 10.39 గంటలకు ప్రతిష్ఠ మహోత్సవం ప్రారంభమవుందన్నారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన జరుగుతుందని పరిసర గ్రామాల భక్తులు హాజరుకావాల్సిందిగా కోరారు.

యువతిని వేధిస్తున్న వ్యక్తిపై కేసు

పెనమలూరు: యువతిని వేధిస్తున్న వ్యక్తిపై పెనమలూరు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు ఇందిరానగర్‌కు చెందిన యువతి గతంలో విజయవాడలోని ఒక హోటల్‌లో పని చేసేది. అక్కడ మేనేజర్‌గా ఉన్న పాపారావు పరిచయం అయ్యాడు. పాపారావు యువతిని ప్రేమించానని వివాహం చేసుకుంటానని వెంటపడ్డాడు. యువతిని పాపారావు ఉద్యోగం మాన్పించి గుంటూరులో ఉద్యోగం ఇప్పించాడు. కొద్దిరోజుల తర్వాత పాపారావు అసభ్యంగా ప్రవర్తించడంతో యువతి గుంటూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇకపై యువతి జోలికి వెళ్లనని పోలీసులకు తెలిపాడు. అయితే పాపారావు తన ప్రవర్తన మార్చుకోకుండా తన వద్ద ఫోటోలు, వీడియోలు ఉన్నాయని యువతిని బెదిరించసాగాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

పెనమలూరు: ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని పెనమలూరు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, గోసాల సర్పంచి సంగెపు శ్రీనివాసరావు అన్నారు. గోసాల, వణుకూరు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం జరిగిన సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు గోసాలలో 380, వణుకూరులో 626 పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో లోయ శివశంకర్, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, వణుకూరు ఉపసర్పంచి గద్దల రాజా, నేతలు గోపీకృష్ణ, ఈవోలు ప్రసాద్, సుబ్బారావు, ఏపీఎం రాజా గోవింద్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



వణుకూరులో ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేస్తున్న అధికారులు

బడుగుల అభ్యున్నతికి పూలే ఎనలేని కృషి



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ శేషగిరిరావు

పెనమలూరు: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి మహాత్మా జ్యోతిరావుపూలే ఎనలేని కృషి చేశారని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త పూలే అని నేటి యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నగర కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా శ్రీనివాసరావు, పెదపులిపాక సర్పంచి గంటూరు శ్రీనివాసచౌదరి, ఏఎంసీ డైరెక్టర్ మండూరు కోటేశ్వరరావు, నేతలు సుబ్బారావు పాల్గొన్నారు.

ఉంగుటూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. ఏపీవో వినీల, ఏపీఎం సాంబశివరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉయ్యూరు: ఉయ్యూరు పట్టణంలోని గ్రంథాలయంలో దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావుపూలే వర్ధంతి మంగళవారం నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.రమణి, ఐక్యవేదిక ప్రతినిధులు ఎంవి.రవి, మట్టా జగన్, హసన్, పవన్ పాల్గొన్నారు.

జగనన్న పాలనలో పేదరిక నిర్మూలన

పెనమలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదరిక నిర్మూలన చర్యలు చేపట్టామని, ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. పెదపులిపాక గ్రామంలో సర్పంచి గుంటూరు శ్రీనివాసచౌదరి అధ్యక్షతన జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొని సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. సీఎం జగన్ అధికారం చేపట్టిన తర్వాత పేదల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టారని చెప్పారు. ప్రధానంగా మహిళా సాధికారితపై చర్యలు తీసుకున్నారని తెలిపారు. నవరత్నాలతో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేశామని, డ్వాక్రా మహిళలకు రుణాలు మాఫీ, అమ్మఒడి, చేయూత, ఆసరా, ఇళ్ల స్థలాలు మంజూరు ఇలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేశామని పేర్కొన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు రుణాలు, రైతుభరోసా, పంటల బీమా వంటి అనేక పథకాలు నేడు అమలు చేస్తున్నామన్నారు. నేడు 45 లక్షల మంది పేద విద్యార్థులకు అమ్మఒడి ద్వారా రూ. 25వేల కోట్లు అందజేశారని వెల్లడించారు. నాడు–నేడుతో పాఠశాలలు అభివృద్ధి చేసి ఇంగ్లీష్ మీడియం చదువు అందిస్తున్నామని వివరించారు.

పెదపులిపాకకి రూ 39.58 కోట్లు:

పెదపులిపాక గ్రామంలో గత నాలుగున్నరేళ్లలో రూ 39.58కోట్లు వెచ్చించామన్నారు. ఇందులో సంక్షేమ పథకాల కింద రూ. 34.61 కోట్లు పేదలకు, మిగితా సొమ్ము గ్రామాభివృద్ధికి ఖర్చు చేశామని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలందరూ జగనన్నకు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సంగెపు శ్రీనివాసరావు, ఎంపీడీఓ సునీతాశర్మ, ఏవో లోయ శివశంకర్, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, ఈవో పద్మావతిదేవి, నగర కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా శ్రీనివాసరావు, సర్పంచి లింగాల భాస్కరరావు, గోపీకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పెదపులిపాకలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

కానూరులో...

తాడిగడప మున్సిపాలిటీ కానూరు 4వ సచివాలయంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నేతలు సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. గ్రామంలో లబ్ధిదారులకు డీబీటీ ద్వారా రూ 24.46 కోట్లు నాన్ డీబీటీ కింద రూ 16.25 కోట్లు అందజేశారని వివరించారు. కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఖాదర్, పఠాన్‌అహ్మద్, శివరామకృష్ణ, నేతలు వేమూరి బాలకృష్ణ, లతీఫ్, గాదె శ్రీకాంత్, బాషా, సైకం చినబాబు, అంబటి రమేష్ పలువురు పాల్గొన్నారు.

ఈడుపుగల్లులో....

కంకిపాడు: మండలంలోని ఈడుపుగల్లు–1 సచివాలయం పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామంలో జరిగిన అభివృద్ధిపై రూపొందించిన సంక్షేమ బోర్డును జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు ఆవిష్కరించారు. ఎంపీటీసీ సభ్యులు బూరగ బాలాజీ, షేక్ అమీనాబి, పార్టీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు, ఏఎంసీ వైస్‌చైర్మన్ మాదు వసంతరావు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఉయ్యూరు పట్టణంలో...

ఉయ్యూరు: ఉయ్యూరు పట్టణంలోని 17, 18 వార్డుల పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), కమిషనర్ వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్‌లు సోతే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, వార్డు కౌన్సిలర్లు రాజులపాటి చిన్ని, నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

గండిగుంటలో...

మండలంలోని గండిగుంట గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సర్పంచి గెత్తం అనుపమ, ఎంపీటీసీ సభ్యుడు బండెల శ్రీనివాసరావు, ఏఎంసీ వైస్‌చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు దాసే రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు నిడమానూరులో పొలంబడి

విజయవాడ రూరల్: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం నిడమానూరు గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు ఒక ప్రకటనలో తెలియజేశారు. నిడమానూరు బైపాస్‌రోడ్డులో వెంకటేశ్వరావు అనే రైతు పొలంలో పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమానికి వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి అధికారులు, విజయవాడ ఏడీ వస్తున్నారని మండలంలోని ఆదర్శ రైతులు, ఆసక్తిగల రైతులు పాల్గొనాలని ఆయన కోరారు.

అనాథ బాలలకు తానా రగ్గుల పంపిణీ

పెనమలూరు: ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) ఆతిథ్య కమిటీ చైర్మన్ అక్కినేని ఆనంద్ కానూరులోని అనాథ బాలలకు మంగళవారం రగ్గులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అనాథ బాలలను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వాసవ్య మహిళా మండలి హోం వార్డెన్ స్వరూపారాణి, కాకర్ల గంగాధరరావు, పీవీఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

వ్యక్తి వద్ద సెల్ ఫోన్‌చోరీ

పెనమలూరు: టీ తాగుతున్న వ్యక్తి వద్ద గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు సెల్‌ఫోన్ చోరీ చేసి పారిపోవడంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. కంకిపాడు మండలం ఈడుపుగల్లుకు చెందిన బంటుమిల్లి వెంకటసాంబశివరావు సోమవారం గోసాల సెంటర్‌లో హోటల్ వద్ద టీ తాగుతున్న సమయంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి షర్టు జేబులో ఉన్న సెల్‌ఫోన్ బలవంతంగా లాక్కుని పారిపోయారు. ఘటనపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

కంకిపాడు: మండలంలోని దావులూరు గ్రామ పరిధిలో జగనన్న లే అవుట్‌లో విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు మంగళవారం చేపట్టారు. పనులను అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలను అందించడంతో పాటుగా, వసతుల కల్పనపైనా దృష్టి సారించిందన్నారు. కార్యక్రమంలో సచివాలయం, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

సంక్రాంతి జాతరకు టెండర్లు ఆహ్వానం

రామవరప్పాడు: ప్రతీ సంవత్సరం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో నిర్వహించే సంక్రాంతి ఉత్సవాలకు పలు వస్తువులు సరఫరా చేసేందుకు సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈవో పి.లోకేశ్వరి తెలిపారు. జనవరి 12 నుంచి 18 వరకు అమ్మవారి ఊరేగింపునకు మేళాలు, సన్నాయి, తీన్మార్ వాయించుటకు, తెప్పోత్సవంనకు తెప్ప ఏర్పాటు, జనవరి 12 నుంచి 19వరకు అన్నసంతర్పణకు భోజనాలు సమకూర్చుటకు, గ్రామోత్సవ రథంకు లైటింగ్, మైక్‌సెట్ ఏర్పాటుకు, షామియానా సప్లై చేసేందుకు సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పూర్తి చేసిన టెండర్లను డిసెంబరు 1న ఉదయం 10.30 గంటలలోపు స్వీకరిస్తామని, అదే రోజు 11 గంటలకు టెండర్లు తెరవనున్నట్లు వివరించారు.

గాయపడిన మహిళ మృతి

పెనమలూరు: ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందడంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం కామయ్యతోపు డాల్ఫిన్ అపార్టుమెంట్‌లో యలమంచిలి శైలజారాణి (55) నివశిస్తుంది. భర్త మృతి చెందగా, కుమార్తె అమెరికాలో ఉంటోంది. కాగా ఈ నెల 12న శైలజారాణి చీరకు దీపం ప్రమిద నిప్పంటుకుని తీవ్రంగా గాయపడింది. ఆమెను ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. ఘటనపై మరిది గౌరీశంకర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

ఆర్బీకేల ద్వారా రైతులకు ప్రయోజనం

నున్న(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడంతో దళారీ వ్యవస్థకు తావులేకుండా రైతులకు ప్రయోజనం చేకూరుతోందని మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు అన్నారు. నున్న గ్రామంలో రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద మంగళవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గోనెసంచులు, హామీలీ చార్జీలు ప్రభుత్వమే భరిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ పోలారెడ్డి చంద్రారెడ్డి, డైరెక్టర్ భీమవరపు ముత్తారెడ్డి, రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెనమలూరు డివిజన్
90105 77706 (ఉయ్యూరు)
99122 20539 (పెనమలూరు)
90102 10382 (గన్నవరం)
Office mail : sakshiads@gmail.com